ఖరీఫ్‌లోనూ కానరాని మెట్ట సాగు

- పెన్నార్ డెల్టా కింద వరిసాగు
- కాలానుగుణంగా తగ్గుతున్న అపరాల సాగు
- రబీలో మినుము, పెసర సాగుపై సందేహాలు
- ఆగస్టులోనూ మండుతున్న ఎండలు

పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో సాగునీటి సౌకర్యం తక్కువగా ఉండడం వల్ల ఖరీఫ్‌లో మెట్టపంటల సాగు లేకుండా పోయింది. ఈ సబ్‌డివిజన్ పరిధిలో పొదలకూరుతో పాటు రాపూరు, కలువాయి, చేజర్ల మండలాలు వస్తాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో మనుబోలు, వెంకటాచలం వంటి మెట్ట ప్రాంతాల్లో సైతం ఖరీఫ్ పంటలు కనిపించకుండాపోయాయి. ఇందుకు ప్రధాన కారణం కాలువల ద్వారా నీరు అందకపోవడంతో పాటు సకాలంలో వర్షాలు కురవకపోవడమేనని రైతులు అంటున్నారు.

పొదలకూరు : పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో రబీసీజన్‌లో కూడా వరిసాగుతో పాటు మెట్ట పంటలైన మినుము, పెసర, కంది సాగు చేస్తుంటారు. అయితే ఈ పర్యాయం మెట్టపంటల సాగు సందేహంగా మారింది. సాధారణంగా జూలై, ఆగస్టు నెలల్లో కురిసే వర్షాలకు రైతులు మెట్టపొలాలను దుక్కిదున్నకం పనులు పూర్తి చేసుకుని సెప్టెంబరులో అపరాల సాగు చేపడుతుంటారు. అయితే ఈ ప్రాంతంలో రైతులు ఇప్పటి వరకు పొలాల్లో సేద్యం చేసిన దాఖలాలు లేవు. ఖరీఫ్ ఎడగారు కింద మండలంలోని పెన్నార్ డెల్టా గ్రామాలైన తాటిపర్తి, విరువూరు, మహ్మదాపురం, సూరాయపాళెం, వెలికంటిపాళెం, నేదురుమల్లి, యర్రబల్లి గ్రామాల్లో 1,035 ఎకరాల్లో మాత్రమే వరిసాగు చేస్తున్నారు. కేవలం 15 ఎకరాల్లోనే వేరుశనగ పంటను పండిస్తున్నారు. దీనిని బట్టి పరిశీలిస్తే ఖరీఫ్‌లో పంటల సాగుపై రైతులు దృష్టి సారించడం లేదు. దీనికి తోడు సోమశిల, కండలేరు జలాశయాల్లో అడుగంటిన నీటి వల్ల కాలువలకు సాగునీరు అందే పరిస్థితి లేకపోవడంతో రబీ సీజన్‌పైనే రైతులు ఆధారపడుతున్నారు.

ఉపయోగం లేని వర్షాలు

జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం కంటే అధికంగా నమోదైనా ఉపయోగం లేకుండాపోయిందని రైతులు అంటున్నారు. ఆగస్టులో ఎండలు మండుతుండడంతో ముఖ్యంగా నిమ్మరైతులు ఆందోళన చెందుతున్నారు. స్వల్పంగా ఖరీఫ్‌లో మెట్టపంటలను సాగు చేస్తున్న రైతులు నేలలో తేమ శాతం ఉండడం లేదని దుక్కిదున్నకం పనులకు కూడా ప్రయోజనం లేదని చెబుతున్నారు. జూన్‌లో సాధారణ వర్షపాతం 54.1 మి.మీ కాగా 115 మి.మీ వర్షపాతం నమోదైంది. జూలైలో 86.3 సాధారణ వర్షపాతం కాగా 175.2 వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఆగస్టులో సాధారణ వర్షపాతం 86.0 నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు వర్షం కురిసింది లేదు. ఎండలు మండిపోవడం వల్ల గతనెలలో కురిసిన వర్షం, తేమశాతం కూడా ఆవిరై పోయిందంటున్నారు. కండలేరు ఎడమగట్టు కాలువ కింద సవక, జామాయిల్, దోస, మిర్చి, బీర పంటలను సాగు చేస్తున్నారు. జలాశయంలో డెడ్ స్టోరేజీ కంటే తక్కువగా నీటినిల్వ ఉన్నందున కాలువకు నీటిని ఇప్పట్లో విడుదల చేసే పరిస్థితి ఉండదు. దీంతో ఖరీఫ్‌లో స్వల్పంగా సాగవుతున్న ఉద్యానపంటలు, స్టాండర్డ్(సవక, జామాయిల్) పంటలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.


గతంలో సాగు చేసిన మినుము పంట

మెట్ట పంటలకు ఇబ్బంది



ఖరీఫ్‌లో సాగవుతున్న మెట్టపంటలతో పాటు ఎడగారు కింద సాగవుతున్న వరికి కూడా ఇబ్బందిగా ఉంది. సాగునీటి సౌకర్యం లేకపోవడం వల్ల పంటల పరిస్థితి ఆశాజనకంగా లేదు. స్వల్పంగా సాగవుతున్న వేరుశనగ పంటకు సక్రమంగా నీరు అందడం లేదు. ప్రాజెక్టులలో నీరు లేకపోవడం వల్ల కాలువకు నీరు విడుదల చేసే పరిస్థితి లేదు.

– కె.రామిరెడ్డి, రైతు, కొనగలూరు

రబీలో మెట్టపంట సాగు



రబీలో మెట్టపంటను సాగు చేసే అవకాశం ఉంది. అయితే రైతులు ఇప్పటి నుంచే పొలాల్లో దుక్కిదున్నకాలు పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. సెప్టెంబరులో మినుము, పెసర, కంది పంటల సాగు చేసుకునేందుకు రైతులు సిద్ధంగా ఉండాలి. మండలంలో రైతులు ఎడగారులో వరిసాగు చేస్తున్నారు.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు

గణనీయంగా తగ్గుతున్న సాగు

గతంలో ఖరీఫ్‌లో కూడా కాలువలకు సాగునీరు అందించడం వల్ల ఎడగారు కింద వరిసాగు 3 వేల నుంచి 4 వేల ఎకరాల్లో సాగయ్యేది. సోమశిలకు ఇప్పుడిప్పుడే శ్రీశైలం నుంచి నీరు వచ్చి చేరుతున్నందున ఖరీఫ్‌లో రైతుల సాగునీటి అవసరాలు తీరేందుకు అవకాశం లేదు. రబీలో సాగునీటిని అందించాలంటే వర్షాలు పుష్కలంగా కురిసి పైతట్టు నుంచి వరద ప్రవాహం పోటెత్తితేనే సోమశిల నిండి కండలేరు జలాశయానికి వరదనీరు వచ్చి చేరుతుంది. కండలేరులో ప్రస్తుతం డెడ్‌స్టోరేజీ కంటే తక్కువగా నీటి నిల్వ ఉంది. డెడ్ స్టోరేజీ 6 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కండలేరుకు సోమశిల నుంచి వరద కాలువ ద్వారా నీరు చేరుకోవాలంటే సోమశిలలో 20 టీఎంసీలకు పైబడి నీటి నిల్వ ఉండాలి. ప్రస్తుతం సోమశిలలో 14 టీఎంసీల పైబడి నీటి నిల్వ ఉండగా మరో మూడు, నాలుగు రోజుల్లో 20 టీఎంసీలకు చేరుకుంటుందని అధికారులు భావిస్తున్నారు. అయితే కండలేరుకు ఏమేరకు వరద కాలువ ద్వారా సోమశిల నుంచి నీటిని విడుదల చేస్తారనేది అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయం తీసుకోవాల్సింది. కండలేరుకు త్వరగా నీటిని విడుదల చేస్తేనే చుట్టుపక్కల మండలాల్లో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంటుంది.


కాలువలు, వర్షాధారంగా సాగవుతున్న సవక పంట

క్లుప్తంగా

వైభవంగా రేణుకా పరమేశ్వరి గ్రామోత్సవం



మనుబోలు : మండలంలోని జట్లకొండూరు గ్రామం అరుంధతీయవాడలో రేణుకా పరమేశ్వరి మాతమ్మ గ్రామోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శుక్ర, శని, ఆదివారాల్లో మూడు రోజుల పాటు మాతమ్మ కొలువు కార్యక్రమాన్ని అరుంధతీయులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ 18 సంవత్సరాల తరువాత మాతమ్మ రేణుకా పరమేశ్వరి ఉత్సవాలను వైభవంగా చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవం వెంట ఏర్పాటు చేసిన తప్పెట్లు, మంగళవాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువకులు ఉత్సాహంగా బాణసంచా పేలుస్తూ, రంగులు చల్లుకుంటూ ఉత్సవం వెంట కేరింతలు కొట్టారు.

బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(క్రైమ్): బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా సాంబశివరావు బాధ్యతలను ఆదివారం స్వీకరించారు. ఎస్సై విజయశ్రీనివాస్, సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడారు. స్టేషన్ పరిధిలో నేర నియంత్రణకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తామని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘిక శక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

అర్జీల స్వీకరణ నేడు

నెల్లూరు(బారకాసు): తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం తదితరాలపై ప్రజలు అర్జీలను అందజేయొచ్చని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం వరకు అర్జీలను స్వీకరించనున్నామని చెప్పారు.

రేపట్నుంచి పవిత్రోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను మంగళవారం నుంచి ఈ నెల 19 వరకు నిర్వహించనున్నామని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంకురార్పణ, హోమంతో కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయని, భక్తులు తరలిరావాలని కోరారు.

పాటల పోటీలు రేపు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(అర్బన్): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, దేశభక్తి పాటలపై పోటీలను మంగళవారం మధ్యాహ్నం నిర్వహించనున్నామని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం, సాంస్కృతిక రంగ కన్వీనర్ పుల్లయ్య పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. విజేతలకు బహుమతులను అందజేయనున్నామని వివరించారు. ట్రస్ట్ నిర్వహణ కమిటీ కన్వీనర్ నగేష్, బాధ్యులు జయరామిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో హల్‌చల్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో గల గృహాల వద్ద ఓ యువకుడు గంజాయి మత్తులో ఆదివారం హల్‌చల్ చేశారు. అటుగా వెళ్తున్న వారిని దుర్భాషలాడటంతో పాటు స్థానికంగా ఉన్న ఇళ్ల వద్దకెళ్లి తలుపులు కొడుతూ వీరంగం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ జరుపుతున్నారు.

పోరాట యోధుడు సీతారామరెడ్డి


సీతారామరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఐటీయూ నేతలు

- ఎంవీపాళెంలో విగ్రహావిష్కరణ

ముత్తుకూరు : పేద పల్లెకాపుల కోసం పలు భూ పోరాటాలు చేసిన పోరాట యోధుడు దివంగత మునుకూరు సీతారామరెడ్డి సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. మండలంలోని మునునూరువారిపాళెం కూడలిలో సీతారామరెడ్డి విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించారు. సీపీఎం ఆధ్వర్యంలో 1979 ప్రాంతంలో అనేక భూ పోరాటాలు సాగించిన సీతారామరెడ్డి 84 ఎకరాల భూమిని సాధించారని గుర్తుచేశారు. ఈ భూములను పేదలకు పంచిపెట్టారని చెప్పారు. ఈ సందర్భంగా సీపీఎం పతాకాన్ని మాజీ జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ ఆవిష్కరించారు. సీఐటీయూ పతాకాన్ని గడ్డం అంకయ్య ఆవిష్కరించారు. సీతారామరెడ్డి అన్న కుమారుడు మునుకూరు రవికుమార్‌రెడ్డి, మనుమరాలు నిఖిల, సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు


బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

పొదలకూరు : పట్టణంలో గంగమ్మతల్లి కొలుపు సందర్భంగా చివరిరోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు పూజలు, 11 గంటలకు ముగ్గుదిష్టి తీర్పు, సాయంత్రం బోనాల ఊరేగింపు జరిగింది. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో దేవస్థానం ప్రాంగణంలో పొంగళ్లు పెట్టుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత భవిష్యత్ ఉంటుందని భద్రావతి సమేత భావనారుషీశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు చలమయ్య, నరసయ్య అన్నారు. పట్టణంలోని ఆలయ ఆవరణలో పద్మశాలీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల పదవీ విరమణ చేసిన డిప్యూటీ కలెక్టర్ ఎంవీ సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. చేనేత కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో సురేంద్రబాబు, మల్లికార్జున, రాధయ్య, సుధీర్‌కుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ సుధాకర్‌ను సన్మానించిన కమిటీ సభ్యులు

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ ఉండాలి

కోవూరు : ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని నెల్లూరులోని సుధీర్ హాస్పిటల్ వైద్యుడు ధీరజ్ అన్నారు. కోవూరు పట్టణంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం వైద్య సలహాలు చేశారు. సురేష్‌కుమార్, రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో డాక్టర్లు నాగ మాణిక్యం, గౌతమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు : మండల నూతన ఎంపీడీఓగా శ్రీహరి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన ప్రకాశం జిల్లా నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి, అధికారులతో పలు అంశాలపై చర్చించారు.

బూడిద టిప్పర్లకు బ్రేక్


నిలిపివేసిన బూడిద టిప్పర్లు

ముత్తుకూరు : మండలంలోని ఏపీజెన్‌కో ప్రాజెక్టు నుంచి బూడిద లోడుతో ముత్తుకూరు మీదుగా వెంకటాచలం వైపు వెళ్లే భారీ టిప్పర్లను ముత్తుకూరు సెంటర్‌లో ఆదివారం నిలిపివేశారు. ముత్తుకూరులోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా పోలీసులు హైస్కూల్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే, ఈ హెచ్చరికను నిర్లక్ష్యం చేస్తూ పెద్ద ఎత్తున దుమ్మురేపుకొంటూ వెళ్లే టిప్పర్లపై స్థానిక వ్యాపారులు ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ టిప్పర్ల వల్ల దుమ్ము లేచి దుకాణాల్లోకి చేరి ఉక్కిరిబిక్కిరి చేస్తోందని, వస్తువుల నాణ్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లకుండా ప్రజలు తిరిగే రోడ్లపై ప్రయాణించడం వల్ల నిలిపివేసినట్లు వ్యాపారులు తెలిపారు.

వీఎస్‌యూ వలంటీర్లకు అభినందన


వలంటీర్లను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం : ఢిల్లీలో జరుగనున్న 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఎంపికైన విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) వలంటీర్లను ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు ఆదివారం అభినందించారు. రాష్ట్రం నుంచి 20 మంది వలంటీర్లు ఎంపిక కాగా, వారిలో వీఎస్‌యూ నుంచి యుగంధర్‌రెడ్డి, ఇండ్ల లవకుమార్ ఎంపికయ్యారు. వీరిని ఇన్‌చార్జి వీసీతో పాటుగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు అభినందించారు.

రహదారులను తవ్వేస్తున్నారు

- వాహనచోదకుల ఇబ్బందులు

పొదలకూరు : గ్రామీణ ప్రాంతాల్లో ఇష్టానుసారం రహదారులను తవ్వేస్తుండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా నావూరు రహదారిపై కొందరు రైతులు అడ్డగోలుగా తవ్వేసి పైపులు వేసుకుని గుంతలను సక్రమంగా పూడ్చకపోవడంతో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారి పొడవునా మొత్తం ఏడు గ్రామాలు ఉన్నాయి. గ్రామాల సమీపంలో తోటలకు బోర్ల ద్వారా పైపులైన్ నిర్మాణానికి రహదారి అడ్డొస్తే తవ్వి నిర్మించుకుంటున్నారు. అనంతరం గుంతలను సక్రమంగా పూడ్చకపోవడంతో వర్షాలకు పెద్ద గోతులుగా మారుతున్నాయి. దీంతో రాత్రి సమయంలో ద్విచక్రవాహన చోదకులు, కొత్తగా ఈ మార్గం గుండా ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపులు ఈ రహదారిలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. దాదాపుగా అన్ని ప్రాంతాల్లో ఇదే సమస్య ఉన్నట్లు వాహనచోదకులు వెల్లడిస్తున్నారు. చాటగొట్ల–బిరదవోలు మార్గంలో ఇదే తరహాల్లో పైపులు వేసి సక్రమంగా పూడ్చకపోవడం వల్ల ఓ టీచర్ ద్విచక్రవాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందారు.


తవ్వేసిన రహదారి

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోండి


నార్తురాజుపాళెం రైటర్‌తోపులో అవగాహన కల్పిస్తున్న ఎస్సై హనీఫ్ అహ్మద్

- ఇళ్లలో చోరీల నుంచి రక్షణ పొందండి
- ఎస్సై హనీఫ్ అహ్మద్

కొడవలూరు : పోలీసు శాఖ ఉచితంగా కల్పించే ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లలోని చోరీల నుంచి రక్షణ పొందాలని ఎస్సై హనీఫ్ అహ్మద్ సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెం సర్కారుతోపు, రైటర్ తోపు, దిన్నె తదితర ప్రాంతాల్లో ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఊరెళ్లేటప్పుడు ఇంట్లోని నగదు, బంగారు తదితర విలువైన వస్తువులు చోరీకి గురికాకుండా ఉండేందుకు పోలీసు వారు ఈ బృహత్తర అవకాశాన్ని కల్పిస్తున్నారని చెప్పారు. ఫలానా రోజు ఊరెళ్తున్నామని పోలీసులకు సమాచారం ఇస్తే ఆ ఇంటి ఆవరణలో పోలీసు శాఖ ద్వారా ఉచితంగానే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారన్నారు. తదుపరి ఊరెళ్లిన వారు తిరిగొచ్చాక మరలా సీసీ కెమెరాలను పోలీసు వారు స్వాధీనం చేసుకుంటారన్నారు. ఇళ్లలోని దొంగతనాలను నివారించేందుకు పోలీసు వారు ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైటర్ పి.వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మనుబోలు : 25 ఏళ్ల తరువాత దేశాలు, రాష్ట్రాలు దాటి వచ్చిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. వారి ఆలింగనాలు, ఆత్మీయ పలకరింపులకు మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 మధ్య చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అదే పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. మూడు నెలల ముందే ప్రణాళికలు వేసుకుని అమెరికా, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉంటున్న పూర్వ విద్యార్థులందరూ హాజరయ్యారు. ఎన్నో ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితుల ఆనందానికి హద్దులు లేకుండాపోయాయి. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటూ ఆట పాటలతో సందడి చేశారు. విద్య నేర్పిన అప్పటి గురువులు వెంకయ్య, కోటేశ్వరరావు, కొండారెడ్డి, లక్ష్మయ్య, భాస్కర్‌రెడ్డి, అజయ్‌కుమార్ తదితరులను ఆహ్వానించి ఘనంగా సన్మానం చేశారు. ఈ ఏడాది ఇదే పాఠశాలలో 574 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని నిహారికకు నగదు పురస్కారం అందించి అభినందించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం చమర్చిన కళ్లతో ఒకరికొకరు వీడ్కోలు తీసుకున్నారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు చెలికం కోటేశ్వరరెడ్డి, చిట్టమూరు లక్ష్మి, పరిమళ సురేష్, ఖాదర్‌వలి, రమేష్, జితేంద్ర మిత్ర బృందం పర్యవేక్షించారు.